
# బేరం

జి. రఘుపతిరావు

"పెళ్లిరోజుకు మంచి పట్టు చీర కొనుక్కోవాలండీ" అంది వారిజ భర్త మధుకర్‌తో.

చాలా మంది భర్తలకు అలాంటి 'డిమాండ్' షాకింగ్ న్యూసేమో కాని, అతను ఆమెతో బాగా అలవాటు పడిపోయాడు. ప్రతి ముఖ్య సందర్భాలను వారిజ చక్కని చీరకొని 'సెలిబ్రేట్' చేసుకుంటుంది. అలాంటిది 'పెళ్లి రోజు'కి కాకపోతే ఎలా?



"అలాగే! కాని 'పట్టు' చీర కోసం పట్టు పట్టనని మాట ఇవ్వాలి ప్లీజ్!" రిక్వెస్ట్ చేశాడు మధు.

"మీరేం భయపడాల్సిన పనిలేదు. ఖరీదైన చీర కొనని మాట ఇస్తున్నాను. రెండు వేల కంటే ఎక్కువ ధర పెట్టను. నేను 'బేరమాడి' మరీ కొంటాను. పదిహేను వందలకే రాబడతాను. వాయిదాలలో తీస్తాను. ప్రస్తుతానికి ఐదొందలిస్తే చాలు!" తన తెలివినంతా ఉపయోగించి చెప్పింది భర్తతో.

"ఓయ్! వారిజగారూ! రెండు వేల శారీ పదిహేను వందలకా? అదీ వాయిదాల్లోనా? ఏ తలమాసిన దుకాణం వాడిస్తాడు అంత లాభానికి?" ఉడికించాడు మధు.

"ఏ దుకాణం వాడూ తల మాసిన వాడు కానక్ఖర లేదు. నా తెలివి తేటలు ఉపయోగించి మరీ కొంటాను. అసలు శారీ మీద 2000 /- రాసి ఉందనుకోండి కేవలం వెయ్యి రూపాయలకే అడుగుతాను. వాడు పదిహేను వందలకైనా ఇస్తాడు. అదీ నా బేరం చేసే సామర్థ్యం!" అంది ధైర్యంగా.

"గుడ్! అలాగే కానీయ్!" ఉడికించాడు మధుకర్.

* * * *

జనవరి నెలేమో ప్రతీ గవర్నమెంటు ఉద్యోగికీ చేతుల్లో పైసా ఆడే సమయం. పండగ అడ్వాన్సు, మెడికల్ రీఎంబర్సుమెంటు లాంటివి చేతిలో రాలతాయి. వారిజ తమ పెళ్ళి రోజు ఘనంగా జరుపుకుందామంటే తనకూ ఇష్టమే! అయినా ఇది తమ వివాహమయింతర్వాత రాబోయే రెండో పెళ్లి రోజు! షాపింగ్ చేద్దామని తను అవసరమైన డబ్బు డ్రా చేశాడు. పెందలాడే ఆఫీను వదిలి త్వరగా ఇల్లు చేరుకున్నాడు. అంత త్వరగా ఇల్లు చేరిన భర్తను చూసి ఆశ్చర్యం నటిస్తూ అంది వారిజ.

"ఏమి నా అదృష్టం! మీరు తొందరగా వచ్చారు. కాని షాపింగ్ మీతో కల్సి చేయాలను కోవటం లేదు నేను!"

"ఏమిటట, పాపం!" కవ్వించాడు మధు.

"మీ మగవాళ్లతో షాపింగ్ చేస్తే బోలెడు నష్ట పోవాలి!" అంది.

"అంటే?" రెట్టించాడు మధు.


"ఏముందీ, మిమ్మల్ని చూసి షాపులాడు రూపాయ వస్తువు మూడు రూపాయలు చెప్తాడు. మాట్లాడకుండా వాడు చెప్పిన ధర చెల్లించి వచ్చెయ్యటమేగా మీరు చేసేది!"

"ఔరా! అంటే మగవాళ్లు ఏమీ తెలియని అమాయకులూ, మీరు తెలివైన వారునా?!"

"కాదండీ! మీరు బేరమాడరు. అదే మేమైతేనా, వాడికి పుటం వేసి మరీ తగ్గించి కొంటాం. తెల్సిందా?"

"సరే బాబూ! మీకు అంతటి ప్రతిభ ఉందని ఒప్పుకుంటున్నాను. నీవు అడిగినట్లు అయిదు వంద లివిగో! నీవే పోయి చీర తెచ్చుకో! అన్నట్లు నాకిష్టమయిన 'జాకీ ఛాన్' పిక్చరొచ్చింది, 'జెమినీ'లో. నీవు షాపింగ్ పూర్తి చేసుకొని వచ్చేటప్పటికి ఇంట్లో ఉంటాను" అన్నాడు.

"అంటే, తొమ్మిది గంటల దాకా వొకే చీర బేరమాడుతూ ఉంటాననేగా మీ ఉద్దేశ్యం?!"




ఎమ్మెన్నార్జే

అంది మూతి ముడిచి.

"కాదేయ్, ఇంగ్లీషు సినిమా కదా, నే నే ముందొస్తానని నా అభిప్రాయం!"

ఇద్దరూ నవ్వులో శ్రుతి కలిపారు.

వారిజ తనను దగ్గరకి తీసుకొని ముద్దు చెల్లిస్తున్న మధుకర్ పెదాలను వొద్దన్నట్లుగా వారించింది.

* * * * *

అనుకున్నదానికి కొంచెం భిన్నంగా అరగంట ముందుగానే చీర పాక్ చేయించుకొని వచ్చింది వారిజ. ఇంట్లో అప్పటికే మధుకర్ వచ్చి భార్య కోసం ఎదురు చూస్తున్నాడు. స్వీట్‌గా సన్న జాజుల పరిమళం గదిలో వ్యాపించే సరికి పత్రిక చూస్తున్న మధుకర్ వారిజ రాకను గుర్తించేడు.

ప్యాకెట్ మధుకు అందిస్తూ "చూశారా! నిన్న మీతో చెప్పిన షెడ్యూలుకు అవంతయినా తేడా లేని విధంగా చీర బేరం చేసి, వాయిదాల్లో కొని తీసుకు వచ్చాను. ఇప్పటి కయినా ఒప్పుకుంటారా, వస్తువు కొనటంలో ఆడవారికున్న ప్రతిభ?" కొంటెగా అంది.

"అహ! నా కా విషయంలో ఎలాంటి సందేహమూ లేదు. నీ కో విషయం చెప్పాలి. నీవు అన్నట్లుగా వాయిదాల్లో కాదు, దుకాణం వాడి కివ్వవలసిన మిగతా వెయ్యి రూపాయలూ ఇచ్చేద్దాం. ఫెస్టివల్ అడ్వాన్సు, గట్రా తీసుకున్నాం కదా! బాకీ ఎందుకు?" అన్నాడు మధుకర్.

"ఆల్‌రైట్. నా కభ్యంతరమేమీ లేదనుకోండి. కానీ వాడికి చెల్లించాల్సిన వాయిదా వచ్చే నెల్లో కదా, ఇంత ముందుగా ఎందుకని!" అంది.

వచ్చే నెలలో చెల్లించాల్సిన వాయిదా వడ్డీతో వసూలు చేయకుండా ఉంటాడా, దుకాణదారు? ఈ మాట బయటికి అనకుండా, "అప్పులంటే చిరాకు పరూ! డబ్బు ఉంచుకొని అప్పెందుకు? నువ్వే చెప్పు!" ఆమె చుబుకం పైకెత్తి అన్నాడు.

శ్రీవారు అంతగా చెబుతుంటే కాదనలేని వారిజ "సరే!" అంది.

* * * *

"నమస్తే సార్" అన్నాడు దుకాణదారు, దుకాణంలో ప్రవేశించే ముందు 'మాస్' బయట వదుల్తున్న మధుకర్‌ని చూసి.

"నమస్కారం! నిన్న మా ఆవిడ కొన్న చీర బాపతు చెల్లించాల్సిన మిగతా పైకం ఇచ్చి వెళ్దామని వచ్చానండీ!" అన్నాడు మధు.

"ఎంత మాట సార్! మే మేమైనా అడిగామా? ఇంకా రెండు వాయిదాలున్నాయి కదండీ! అమ్మగారు ఆ నిబంధన మీదే 'పట్టు చీర' తీశారు!" అన్నాడు.

"మీ పద్ధతేమీ బాలేదండీ! ఆడవాళ్లు వస్తేనే తగ్గిస్తారు. ఇదే మేమొస్తే చూడండి ధర నసాళాని కంటిస్తారు!

"మీ వరస నా కర్థం కావడం లేదు బాబూ!" అభియోగం మోపాడు మధుకర్.

"చూడండి మధుకర్‌గారూ! మీ రీ విధంగా 'చిరునింద' మాపై మోపారు కాబట్టి వ్యాపార రహస్యం చెప్పక తప్పటం లేదు. మీ రొచ్చినా లేక మీ శ్రీమతి గారొచ్చినా మేం అమ్మే ధరలో ఎలాంటి తేడా రాదు. సరికదా, మీరు వస్తే మాకు బేరం తొందరగా ముగుస్తుంది. మీరు త్వరగా ఇంటికెళ్ల గలుగుతారు. ఆడవాళ్లు వచ్చేరనుకోండి - వారు బేరం చేసే మార్జిన్ కలుపుకొని ఉండే ధర ఎక్కువగా చెప్పి తగ్గించడం జరుగుతుంది. ఇదిగో చీర మీద ధర అంటించిన స్టిక్కరుంది చూశారూ? మీరు షాపింగ్‌కు వస్తే కొంత శాతం తగ్గించి అమ్ముతాము. మీ శ్రీమతి లాంటి వారు వచ్చారను కోండి. దీన్నే నిజం ధరగా చెప్పి తగ్గించ గలిగిన శాతం తగ్గించి వారి 'ఈగో' శాంతింపచేయడం జరుగుతుంది" అన్నాడు షాపు యజమాని.

చెల్లించ వలసిన రెండు వాయిదాల సొమ్ము చెల్లించి షాపు నుండి బయటకు నడిచాడు మధుకర్, చిరునవ్వుతో కూనిరాగం తీసుకుంటూ శ్రీమతి నెలా 'ఉడికించాలా' అని ఆలోచిస్తూ, అలవోకగా స్కూటర్ స్టార్ట్ చేశాడు ఇంటిదారి పడుతూ